
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
ఆదివారం, జూలై 27, 2026 | పేజీలు :4





## విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నం

### ఎంపీ డీకే అరుణ



హైదరాబాద్, జులై 26:
నీట్ పరీక్ష అంశంపై కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం అనవసర రాద్దాంతం చేస్తున్నాయని బీజేపీ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు




- –ఆగస్టు 1 నుంచి పంపిణీకి చర్యలు
- –రేషన్ దుకాణాలకు సరఫరా
- –ఈకేవైసీ పూర్తి చేసుకోవాలి
- –జిల్లా పౌరసరఫరా అధికారులు

**మహబూబ్‌నగర్ (ప్రజాజ్యోతి)**
ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయాలని కేంద్రప్రభుత్వం మరోమారు నిర్ణయించింది. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలలకు సంబంధించిన రైస్‌ను లబ్ధిదారులకు ప్రభుత్వం ఒకేసారి ఇవ్వనున్నారు. దీని కోసం జిల్లా పౌరసరఫరా అధికారులు రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా ప్రక్రియను చేపట్టారు. ఆగస్టులో మూడు నెలలకు సంబం ధించిన బియ్యాన్ని రేషన్‌కార్డు దారులకు ఇవ్వనున్నారు.

**ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలి..**
రేషన్ కార్డుల లబ్ధిదారులందరు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**ఆందోళనలో డీలర్లు..**
మూడు నెలల రేషన్ బియ్యం కోటా ఒకేసారి విడుదల చేస్తుండడంతో తమకు శ్రమ అధికమవుతుందని



## తెలంగాణకు నీటి అన్యాయం ఆపాలి

– అక్రమ ప్రాజెక్టులు నిలిపివేయాలి –మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్




## గ్రామ పంచాయతీల్లో.. గ్రామ సభలు నిర్వహించాలి

### నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

**నాగర్ కర్నూల్ జులై 26 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం కారణంగా నాగర్ కర్నూల్ జిల్లాలోనూ వర్షపాతం తగ్గిన నేపథ్యంలో గ్రామీణ ప్రజలు, రైతులను అప్రమత్తం చేయడంతో పాటు ముందస్తు చర్యలపై విస్తృత అవగాహన కల్పించేందుకు జూలై 30న జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి అధికారులకు, మండల స్థాయి అధికారులకు, సర్పంచ్‌లు,



# విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నం

చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, ఆప్ విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నం చేస్తున్నాయని ఎంపీ డీకే అరుణ అన్నారు. నీట్ పరీక్ష పేరుతో కొందరు ఉద్దేశపూర్వకంగా దేశంలో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు.
గతంలో ఎన్నడూ పేపర్ లీక్ జరగనట్లు ఇప్పుడు వ్యవహరిస్తూ రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేందుకు కుట్రపూరితంగా ఈ అంశాన్ని రాజకీయ రంగంలోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు. దేశాన్ని అస్థిరపరిచే లక్ష్యంతోనే ఈ ప్రచారం సాగుతోందని ఆమె ఆరోపించారు.ఈ సందర్భంగా డీకే అరుణ మాట్లాడుతూ.. 'కేంద్రం తలుచుకుంటే రేవంత్ ఒక్కరోజు సీఎం కుర్చీలో ఉండరు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల అవినీతి చిట్టా మా దగ్గర ఉంది. అమాయక విద్యార్థులను రెచ్చగొట్టి పబ్బం గడపటం రాహుల్‌కు అలవాటు. కేంద్రం సహకారం లేకుండా.. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకు వేయలేదు. విద్యార్థుల భవిష్యత్ కోసం ప్రధాని నిర్ణయం తీసుకున్నారు. ఊళ్లో పెళ్లికి కుక్కల హడావిడిలా రేవంత్ వ్యవహారశైలి ఉంది. జంతర్ మంతర్ దగ్గర ఏం జరిగిందో.. ఎవరు చేయించారో తెలుసు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 ప్రశ్నాపత్రం లీకైనప్పుడు అప్పటి బాధ్యులు ఎందుకు రాజీనామా చేయలేదు. గతంలో జరిగిన పేపర్ లీకేజీల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు. అమాయక విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనం పొందడం కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి అలవాటైంది. నల్ల దుస్తులు ధరించి గేట్ల ముందు నిలబడటం తప్ప రాహుల్ గాంధీ దేశానికి, విద్యార్థులకు చేసిన మేలు ఏమిటి' అని అన్నారు.

# గ్రామ పంచాయతీల్లో.. గ్రామ సభలు నిర్వహించాలి

పంచాయతీ కార్యదర్శులకు ఈ మేరకు జిల్లా కలెక్టర్ స్పష్టమైన సూచనలు జారీ చేశారు.
ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఇప్పటికే చెరువులు, రిజర్వాయర్లు, భూగర్భ జలాల నీటిమట్టాలు తగ్గుముఖం పట్టే పరిస్థితులు నెలకొనే అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడితే వ్యవసాయం, పశుసంవర్ధక రంగం, గ్రామీణ ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలు రూపొందించి వాటిని సమర్థవంతంగా అమలు చేయడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వహించే గ్రామసభల్లో రైతులు, గ్రామస్థులకు ఎల్‌నినో ప్రభావం, దాని వల్ల ఏర్పడే పరిస్థితులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.గ్రామసభల్లో ముఖ్యంగా వ్యవసాయ పంటలకు సంబంధించి ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళిక (కాంటింజెన్సీ ప్లాన్), తాగునీటి నిర్వహణ, నీటి సంరక్షణ చర్యలు, వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణం, సామూహిక ఇంకుడు గుంతల ఏర్పాటు, వ్యవసాయ క్షేత్రాల్లో ఫార్మ్ పాండ్ల నిర్మాణం, పర్కొలేషన్ ట్యాంకుల ఏర్పాటు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, వర్షపు నీటి సంరక్షణకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించి ప్రజల్లో అవగాహన పెంపొందించాలని సూచించారు.జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో జూలై 30న గ్రామసభలను తప్పనిసరిగా నిర్వహించి, రైతులు, మహిళా సంఘాలు, యువత, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.అలాగే మండల పంచాయతీ అధికారులు (ఎంపీవోలు), మండల పరిషత్ అభివృద్ధి అధికారులు (ఎంపీడీవోలు), డివిజనల్ పంచాయతీ అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు గ్రామసభల నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షించి, ఎక్కడా నిర్లక్ష్యంచోటుచేసుకోకుండా చూడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.
గ్రామసభలు విజయవంతంగా నిర్వహించిన అనంతరం సంబంధిత వివరాలతో కూడిన సమగ్ర నివేదికలను జిల్లా పంచాయతీ కార్యాలయానికి వెంటనే పంపించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

# మెడికల్ కళాశాల ల్యాబ్ టెక్నీషియన్లకు స్కిల్డ్ జీతాలు ఇవ్వాలి

## -టి.యు.సి.ఐ డిమాండ్

నాగర్ కర్నూల్ : జులై 26 (ప్రజా జ్యోతి)
ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ మెడికల్ కళాశాలలో పని చేస్తున్న ఔట్సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ల జనరల్ బాడీ సమావేశం ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం లో నిర్వహించారు.ఈ సమావేశానికి ™=+ వర్మ అధ్యక్షత వహించగా వక్తలుగా టి.యు.సి.ఐరాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్. పద్మ సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్,శ్రీనివాసులు పాల్గొని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న అన్ని మెడికల్ కాలేజీల ల్యాబ్ టెక్నీషియన్లకు వాళ్ళ విద్యార్హతలకు అనుగుణంగా స్కిల్డ్,సెమీస్కిల్డ్,అన్ స్కిల్డ్ జీతాలు చెల్లిస్తున్నారని కేవలం నాగర్ కర్నూల్ జిల్లా మెడికల్ కాలేజీ లో పనిచేస్తున్న టెక్నీషియన్స్ మీు.ఐమీు.దీుజ,మీు చేసినప్పటికీ అన్ స్కిల్డ్ వేతనాలు ఇవ్వడం అన్యాయం,తక్షణమే వీటిని సవరించి స్కిల్డ్ జీతా లివ్వాలని ౹ఖజ× డిమాండ్ చేస్తుందన్నారు.పనిచే స్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని,ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా జీతాలివ్వాలని,కాంట్రా క్ట్ అవుట్ సోర్స్ విధానాన్ని రద్దుచేసి,రెగ్యులరైజ్ చేయాలని, అందరికీ హెల్త్ ఇన్సూరెన్స్ ప్రభుత్వ ప్రకటన ప్రకారం అమలు చేయాలని అదేవిధంగా వేతనాలను సకాలంలో చెల్లించాలన్నారు.నేడున్న నిత్యావసర ధరలకనుగుణంగా వేతనాలు పెంచి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈసమావేశంలో మెడికల్ కాలేజీ ల్యాబ్ టెక్నీషియన్ శేఖర్.అశోక్.రాము,శివప్రసాద్,దీప్తి,
సునీత,అనురాధ,గౌతమి,శశిరేఖ,శ్రావణి,మున్నీ,మౌనిక.రుచిత,శేఖర్,వీర భద్ర,అశోక్,మొహసిన్,కృష్ణ,యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



# ఒకేసారి 3నెలల రేషన్

డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షాపులు చిన్న ఇండ్లలో ఉండడంతో నిల్వ సామర్థ్యం లేకపోవడం మూడునెలల కోటా పట్టకపోవడం వంటి సమస్యలు ఉన్నాయని దీంతో పాటు తూకంలో తరుగు వస్తుందని వాపోతున్నారు. గతంలో కూడా రెండుసార్లు ఇచ్చిన రేషన్ కోటాలో తరుగు వచ్చి నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పాస్ యంత్రాలు సక్రమంగా పనిచేయకపోవడం సిగ్నల్ అందకపోవడం, వినియోగదారుల వేలిముద్రలు పెట్టడం కష్టమవుతోంది. ఒక్కొక్కరికి 20 నిముషాల సమయం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## జీబీవీలు, యూఆర్ఎస్ మోడల్ స్కూల్ హాస్టళ్లకు సరఫరాదారుల ఎంపిక రేపు

**మహబూబ్‌నగర్, జూలై 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
మహబూబ్‌నగర్ జిల్లాలోని 15 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీలు), యూఆర్ఎస్ మోడల్ స్కూల్ బాలికల హాస్టళ్లకు కూరగాయలు, పండ్లు, మటన్, చికెన్ సరఫరా కోసం దరఖాస్తు చేసుకున్న వారు జూలై 27న సాయంత్రం 4 గంటలకు జిల్లా పర్చేసింగ్ కమిటీ కార్యాలయంలో తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారి తెలిపారు.జిల్లా పర్చేసింగ్ కమిటీ ఆమోదించిన ధరల ప్రకారం కూరగాయల ధర కిలోకు 26, మటన్ 620, చికెన్ రోజువారీ పేపర్ ధర కంటే 25 తక్కువ, అరటిపండ్లు ?30, కళింగపండు 15, అంగూర్ 60, ఆరంజ్ 65, జామకాయలు 27, బొప్పాయి ?28, మామిడిపండ్లు 30, ఆపిల్ ?75గా నిర్ణయించారు.ఈ వస్తువుల సరఫరా కోసం ఆసక్తి గల అర్హులైన వ్యక్తులు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఇప్పటికే దరఖాస్తులు సమర్పించారు. పాఠశాలల వారీగా సరఫరాదారుల కేటాయింపు గౌరవ అదనపు కలెక్టర్, జిల్లా పర్చేసింగ్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సమావేశంలో చేపట్టనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వెల్లడించారు.

## బాదేపల్లి జడ్పీహెచ్ఎస్‌లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### దాతల సహకారంతో బోర్‌వెల్, మోటార్ ఏర్పాటు

**జడ్చర్ల, జూలై 26 ( ప్రజా జ్యోతి ) :**
బాదేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల లో చాలా కాలంగా నెలకొన్న తాగునీటి సమస్యకు దాతల సహకారంతో శాశ్వత పరిష్కారం లభించింది. సుమారు 1,060 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న ఈ పాఠశాలలో నీటి కొరత కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, దాతలు శంకర్ బాబు, రంజిత్ బాబు తమ సేవాభావంతో బోర్‌వెల్ తవ్వించి, బోర్ మోటార్ ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. ఆదివారం బోర్ మోటారును ప్రారంభించి ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాతల సేవలను పాఠశాల కుటుంబ సభ్యులు అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.
కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, యుగంధర్ రెడ్డి, సునీల్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ ఆర్.కే., స్టాఫ్ సెక్రటరీ ఎం. శంకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్ ఉమాశంకర్ కూడా హాజరై దాతలను ప్రత్యేకంగా అభినందించారు.
ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, వేలాది మంది విద్యార్థులకు ఉపయోగపడే ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టిన శంకర్ బాబు, రంజిత్ బాబులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. వారి సేవాస్ఫూర్తి సమాజానికి ఆదర్శంగా నిలవాలని, భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజాహిత కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించింది.



# తెలంగాణ నీటి వాటాను కాపాడాలి..

## లేదంటే ఉద్యమం ఉధృతం : మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి

**జడ్చర్ల, జూలై 26 ( ప్రజా జ్యోతి ):**

కర్ణాటక రాష్ట్రంలో కృష్ణా నదిపై అక్రమంగా నిర్మించిన గుగ్గల్ బ్యారేజ్, భీమా నదిపై గూడూరు వద్ద నిర్మించిన బ్యారేజ్‌ను మాజీ మంత్రులు డా. సి. లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నీటి నిల్వలు, తెలంగాణకు రావాల్సిన జలాల పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అత్యంత అన్యాయానికి గురైన జిల్లా పాలమూరేనని అన్నారు. ఆంధ్ర పాలకుల నిర్లక్ష్యం, కుట్రల కారణంగానే పాలమూరు అభివృద్ధికి దూరమైందని, అదే తెలంగాణ ఉద్యమానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సహా పలు సాగునీటి ప్రాజెక్టులను చేపట్టి దాదాపు పది లక్షల ఎకరాలకు సాగునీరు అందించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం తాగునీరు, బ్యారేజీల పేరుతో ఎగువ ప్రాంతాల్లో నీటిని నిల్వ చేయడం వల్ల తెలంగాణకు రావాల్సిన జలాలు తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భీమా నదిపై హైడ్రాలిక్ గేట్లు ఏర్పాటు చేయడం వల్ల వర్షాకాలంలో కూడా పాలమూరుకు తగినంత నీరు చేరడం లేదని అన్నారు. నీటి సమస్యపై మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలతో చర్చలు జరిపి రాష్ట్రానికి, ముఖ్యంగా పాలమూరుకు అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేసిన ఆయన, తాము పాదయాత్ర ప్రకటించిన తర్వాతే ప్రభుత్వం స్పందించిందని వ్యాఖ్యానించారు. ఎగువ





రాష్ట్రాలు నీటిని అడ్డుకుంటే పాలమూరు జిల్లా మళ్లీ కరవు బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన రిజర్వాయర్లు కరువు పరిస్థితుల్లో తెలంగాణను కాపాడాయని, రాష్ట్రానికి కేటాయించిన నీటి వాటాను ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వం పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ప్రజలతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని డా. సి. లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాలమూరులో తొలి ఏకాదశి ఉత్సవాల్లో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు భండారి శాంతికుమార్

**మహబూబ్‌నగర్, జూలై 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బండ్లగేరి శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామి దేవాలయంలో ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన భక్తి ప్రపత్తుల ఊరేగింపులో బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు భండారి శాంతికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీ రుక్మిణీ పాండురంగ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం మాట్లాడుతూ, ఆషాఢ ఏకాదశి సనాతన ధర్మంలో అత్యంత పవిత్రమైన పర్వదినమని పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, దేవాలయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భక్తి, సేవాభావం, సంస్కృతి పరిరక్షణతోనే సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం మరింత బలోపేతమవుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నంబి రాజు, స్థానిక



కార్పొరేటర్ కమర్తి ఈశ్వరయ్య, ప్రవీణ్ చింటూ యాదవ్, బుట్ట ఆనంద్, ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడే పెద్దమారూర్‌లో శ్రీశైలం నిర్వాసితుల సమావేశం

**మాజీ ఎంపీటీసీ కేతపాగ చంద్రయ్య పత్రికా ప్రకటన ద్వారా 67 గ్రామాల నిర్వాసితులకు పిలుపునిచ్చారు.**

**చిన్నంబావి, జూలై 26 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండలం పెద్దమారూర్ గ్రామంలో నేడు శ్రీశైలం నిర్వాసిత కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీటీసీ కేతపాగ చంద్రయ్య పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. 40ఏళ్లుగా కొనసాగుతున్న నిర్వాసితుల హక్కుల పోరాటానికి ఇది కీలక సమావేశమని పేర్కొన్నారు. జీవో 98 అమలు, ఉద్యోగాలు, 20 లక్షల పర్యాయం హక్కుల సాధన కోసం 67 గ్రామాల నిర్వాసితులు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



# ఎల్ నినో పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలో మూడు రోజుల 'విత్తన మేళ'

### -- రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాల అందుబాటు

**మహబూబ్‌నగర్, జూలై 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**




రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని మండలాల్లో జూలై 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు 'విత్తన మేళ' నిర్వహించనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్ తెలిపారు. ప్రస్తుత ఎల్ నినో వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శాస్త్రవేత్తలు సూచించిన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు ప్రతి మండలంలో ఒక విత్తన మేళ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ విత్తన మేళలో కంది, మినుము, పెసర, సజ్జ, మొక్కజొన్న, ఆముదం, పొద్దుతిరుగుడు పంటల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రస్తుత ఎల్ నినో పరిస్థితులకు అనుకూలమైన పంటలను సాగు చేసి మెరుగైన దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు. మరిన్ని వివరాల కోసం రైతులు తమ మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని ఆయన తెలిపారు.

# ఆరోగ్య సర్వేలో ప్రతి ఇంటిని సందర్శించి వివరాల సేకరించాలి

### –డిప్యూటీ డిఎంహెచ్ఓ భరత్ కుమార్ రెడ్డి

నాగర్ కర్నూల్ : జులై 26(ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ లోని పీపీ యూనిట్ వైద్యులు ఆరోగ్య సిబ్బంది నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోఇంటింటా జాతీయ అసంక్రమిత వ్యాధి ఆరోగ్య సర్వే నిర్వహించాలని డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓభరత్ కుమార్ రెడ్డి అన్నారు.జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ,బీసీ కాలనీ,ఈశ్వర్ కాలని, రాఘవేంద్ర కాలనీ,ఎర్రగడ్డ,వినోభ నగర్,శ్రీనగర్ కాలనీ,టీచర్స్ కాలని,రాహత్ నగర్ కాలనీ,వడ్డే గేరి,సంజయ్ నగర్,పాపయ్య కాలనీ,మధురా నగర్,క్రిస్టియన్ కాలనీ,బృందావన్ కాలనీ,శ్రీపురం రోడ్,నల్లవెల్లి రోడ్డు ప్రాంతాల్లోని ఇంటింటికి వెళ్లి30 సంవత్సరాలు పైబనవారి కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను సేకరించాలని డిప్యూటీ డి.ఎమ్.డిఎమ్.హెచ్.ఓ భరత్ కుమార్ రెడ్డి అన్నారు.ప్రభుత్వ ఆదేశం ప్రకారం బి.పి,షుగర్,టి.బి.పక్షవాతం,గర్భవతులు,క్యాన్సర్ రోగులు,కుటుంబ నియంత్రణ వివరాలను సేకరించాలని,ఆరోగ్య బృందం,ఆశాలు సేకరించిన ఆధార్ సంబంధిత వివరాలను ఆన్లైన్ నమోదు చేసి,సర్వేను ఇదే నెలలో పూర్తిచేయాలనీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పి.పి.యూనిట్ మెడికల్ అధి కారి డాక్టర్ సృజన,హెల్త్ ఎడ్యుకేటర్ ఓరుగంటి శ్రీనివాసులు,సూపర్వైజర్ మరియమ్మ,మహిళా ఆరోగ్య కార్యకర్తలు నర్సింగమ్మ,కల్పన,సునీత,ఫార్మసీ అధికారి అఖిల,ఆశాలు సిబ్బంది పాల్గొన్నారు.



# సిద్దాయిపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్

## -- పత్రాలు లేని 45 వాహనాలు స్వాధీనం



**మహబూబ్‌నగర్, జూలై 26 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :** జిల్లా ఎస్పీ దరావత్ జానకి ఆదేశాల మేరకు కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా భూత్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిద్దాయిపల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఆదివారం ఉదయం ముమ్మర కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల్లో భద్రతా భావం పెంపొందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో సుమారు 100 మంది పోలీసు సిబ్బంది పాల్గొని కాలనీలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సోదాల్లో సరైన పత్రాలు లేని మొత్తం 45 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో 1 కారు, 3 ఆటోలు, 41 ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. ఆయా వాహనాల పత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. అదేవిధంగా, వేలిముద్రల విశ్లేషణ పరికరం ద్వారా సుమారు 100 మంది వ్యక్తులను తనిఖీ చేయగా 7 మంది అనుమానితులను గుర్తించారు. వారి నేపథ్యంపై లోతుగా విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. సోదాల అనంతరం కాలనీవాసులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదకద్రవ్యాల దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరిచితుల ఫోన్ కాల్స్, అనుమానాస్పద లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగం, అలాగే ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలు--పోలీసుల మధ్య సత్సంబంధాలు బలోపేతం అవుతాయని, ప్రజల సహకారంతోనే నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై స్థానిక పోలీసులకు లేదా 100/112 నంబర్లకు సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రమణారెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, భూత్పూర్ ఎస్ఐ రామకృష్ణ, సబ్ ఇన్‌స్పెక్టర్ నాగన్నతో పాటు ఇతర పోలీసు అధికారులు, పాల్గొన్నారు.

## యువకుడి నేత్రదానం..



మహమ్మదాబాద్, జూలై 26 ( ప్రజా జ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ యువకుడి కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలోనూ మానవతా దృక్పథాన్ని చాటుతూ నేత్రదానానికి అంగీకరించారు. మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన రాఘవేందర్ వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. శనివారం రాత్రి మహబూబ్‌నగర్‌లో పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి తిరిగి వస్తుండగా, రాత్రి 11 గంటల సమయంలో హన్వాడ మండలం పల్లెమోని కాలనీ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాఘవేందర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విషాద సమయంలోనూ కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేయడానికి అంగీకరించారు. వైద్యుల సహకారంతో నేత్రాలను సేకరించి, చూపును కోల్పోయిన వారికి వెలుగునిచ్చేందుకు నేత్ర బ్యాంకుకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఈ నిర్ణయం పలువురి ప్రశంసలు అందుకుంటూ, అవయవదానంపై సమాజంలో మరింత అవగాహన పెంపొందించే ఆదర్శంగా నిలిచింది.

## శ్రీ సుంకులమ్మ అవ్వ దేవాలయంలో హరిత ఫామ్స్ ఆధ్వర్యంలో అన్నదానం

వడ్డేపల్లి జూలై 26(ప్రజా జ్యోతి):వెంకట్రాంనగర్ గ్రామంలోని శ్రీ సుంకులమ్మ అవ్వ దేవాలయ ప్రాంగణంలో హరిత ఫామ్స్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ పుణ్య కార్యక్రమానికి గ్రామ ప్రజలు,భక్తులు, యువకులు,నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే కార్యక్రమ ఏర్పాట్లలో చురుగ్గా పాల్గొన్న వెంకట్రాంనగర్ గ్రామ యువకుల సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమం అనంతరం గ్రామ పెద్దలు,యువకులు, నాయకులతో కలిసి హరిత ఫామ్స్ ప్రతినిధులు గ్రూప్ ఫోటో దిగారు.”అన్నదానం మహాదానం”అనే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని హరిత ఫామ్స్ యాజమాన్యం తెలిపింది. ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హరిత ఫామ్స్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలియజేసింది.



# ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

## -రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డిమాండ్




**నాగర్ కర్నూల్ : జులై 26 (ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూల్ పట్టణంలోనిఎస్.టి.యూ భవన్లో ఆదివారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కే.శ్రీధర్ రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంఉపాధ్యాయుల సమస్యలను వెంటనేపరిష్కరించాలని,ఉపాధ్యాయులకు రావలసిన6 డి.ఏ.ల బకాయిలను విడుదల చేయాలని పి.ఆర్.సి.ని తక్షణమే ప్రకటించాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పోకల సతీష్ మాట్లాడు తూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ ను రద్దు చేసి ఓ.పి.ఎస్ అమలు పరచాలన్నారు. అనంతరం రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ మాట్లాడు తూ విద్యారంగ పరిరక్షణ కోసం ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధన రెండు దశాబ్దాలుగా ఉన్న సమస్యను పరిష్కరించి మండల విద్యాధికారి, డిప్యూటీ ఈవో,జూనియర్ లెక్చర్ పోస్టులకు పదోన్నతులు కల్పించాలని,ఉద్యోగ ఉపాధ్యాయుల హెల్త్ కార్డ్స్ జాప్యం లేకుండా,ఇవ్వాలని జిపిఎఫ్,మెడికల్ రీయంబర్స్మెంట్,సరెండర్ లీవ్ పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని,రిటైర్ ఉపాధ్యాయులకు రావలసిన బెనిఫిట్స్ ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగాఉన్న ఉపాధ్యాయ ఖాళీలను భర్తీచేయాలన్నారు.

కార్యక్రమంలో సత్యనారాయణ,కరుణాకర్ రెడ్డి, మల్లయ్య,బాల స్వామి,సురేష్‌బాబు,శ్రీనివాసచారి,వెంకటస్వామి,హనుమంతు,శేఖర్,నరసింహ,నారాయణ,జహంగీర్ పాల్గొన్నారు.

## సాహు మహారాజ్ ఆశయాలను పాలకులు విస్మరించారు

**చిన్నంబావి, జూలై 26 (ప్రజాజ్యోతి)** పాలకులు ఛత్రపతి సాహు మహారాజును స్ఫూర్తిగా తీసుకుని సామాజిక న్యాయానికి కట్టుబడి పనిచేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పృథ్వీరాజ్ అన్నారు. 124వ రిజర్వేషన్స్ డే సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో చిన్నంబావి మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ అధ్యక్షుడు బొల్లి కురుమయ్య అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ రాంచందర్ పాల్గొన్నారు. 1902 జూలై 26న ఛత్రపతి సాహు మహారాజ్ వెనుకబడిన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి సామాజిక న్యాయానికి నాంది పలికారని బండి పృథ్వీరాజ్ పేర్కొన్నారు. బహుజనుల అభ్యున్నతికి రిజర్వేషన్లు బలమైన పునాదిగా నిలిచాయని, వాటి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జి కళ్యాణ్, వనపర్తి జిల్లా అధ్యక్షుడు మిద్దె మహేష్, జిల్లా కార్యదర్శి బంకలి దాస్, కొల్లాపూర్ అసెంబ్లీ ఇన్‌చార్జి మునిస్వామి, అంజి, ప్రశాంత్, విధాత, బాలు, విక్రమ్, రామకృష్ణ, అశోక్, ప్రకాష్, నాగ శేషు, సాయికుమార్, దానయ్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## సీఎం రేవంత్ రెడ్డి పిల్ల చేష్టలు మానుకొని ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

### గవి నోళ్ల శ్రీనివాస్

**నారాయణపేట ప్రతినిధి జూలై 26 (ప్రజా జ్యోతి)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనవసర రాజకీయ అంశాల్లో జోక్యం చేసుకుంటూ రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీయకుండా, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర సమితి ( టిఆర్ఎస్) నారాయణపేట జిల్లా అధ్యక్షులు, నారాయణపేట నియోజకవర్గం ఇంచార్జి గవి నోళ్ల శ్రీనివాస్ అన్నారు. రెండు వైపులా జాతీయ జెండాలు ఏర్పాటు చేసుకొని హిందీలో మాట్లాడితే జాతీయ నాయకుడు కాలేరని ఆయన విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయడంతో పాటు, బీసీలకు ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా పూర్తిగా విద్యార్థుల పోరాట ఫలితమే తప్ప, అందులో రాష్ట్ర ప్రభుత్వానికి లేదా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని గవి నోళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆ అంశాన్ని తమ రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడం సరికాదని విమర్శించారు.

అలాగే అనవసర జాతీయ రాజకీయాల్లో జోక్యం చేసుకొని తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠకు భంగం కలిగించే వ్యాఖ్యలు, చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారం, ఎన్నికల హామీల అమలుపైనే ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాలని గవి నోళ్ల శ్రీనివాస్ కోరారు.

